సాక్షి ప్రకాశం

మంగళవారం । 6 । మే । 2025



స్టాండింగ్ కమిటీ లేనట్లే..

ఒంగోలు నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ ఇక లేనట్లే. కమిటీ కాలపరిమితి పూర్తయి ఏడాదైనా నేటికీ నోటిఫికేషన్ వెలువడలేదు. - 8లో..



ఆమె ఆదేశం..అధికారుల అత్యుత్సాహం

దర్శిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల వ్యాపారాలపై కూటమి నేతల కక్షసాధింపులు పెరిగిపోతున్నాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
40 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

ఒంగోలు సబర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే ఊరుకోబోనని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, వరకుమార్, విజయజ్యోతితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణతో యానాదులకు న్యాయం



నిరసన ప్రదర్శన చేస్తున్న యానాది సంఘాలు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ యానాది పోరాట సమితి ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద యానాదులు సోమవారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న యానాది సంఘ నాయకుడు కేసీ పెంచలయ్య యానాది మాట్లాడుతూ ఏపీలో 10 లక్షల మంది యానాదులు ఉన్నారన్నారు. రాష్ట్రంలోనే గిరిజన తెగల్లో అత్యధిక జనాభా యానాదులు ఉన్నారన్నారు. గిరిజన జాతుల్లో జనాభా పరంగా మొదటి స్థానంలో ఉన్న యానాదులు నేటికీ అన్ని విధాలుగా వెనుకబడి ఉన్నారన్నారు. యనాదులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, ఎస్సీ వర్గీకరణలా ఎస్టీలను కూడా వర్గీకరిస్తే యానాదులు అభివృద్ధి చెందుతారన్నారు. యానాదుల అభివృద్ధి కోసం యానాదుల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సమితి జిల్లా అధ్యక్షుడు కే మాల్యాద్రి యానాది అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జంగ్రోజుపల్లి ఆంజనేయులు, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో సీహెచ్‌ఓల నిరసన



ఒంగోలు టౌన్: పదోన్నతులు, ఇంక్రిమెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌ఓలు చేస్తున్న సమ్మె సోమవారం 7వ రోజుకు చేరింది. రోజుకో విధమైన వినూత్న నిరసనలు చేస్తున్న సీహెచ్‌ఓలు కళ్లకు నల్లటి గంతలు కట్టుకొని దీక్షలో పాల్గొన్నారు. ఏపీఎన్జీవో ప్రసిడెంట్ కె.శరత్‌బాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెతో గ్రామీణ ప్రజలు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారన్న సంగతిని గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్జీజీఓ తాలుకా ప్రసిడెంట్ మంజీష్, ఏపీ ఎంసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.రాజేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, కార్యదర్శి ప్రసన్న, ఉపాధ్యక్షురాలు జీవన జ్యోతి, రామాంజనేయులు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

కగార్ పేరుతో ఆదివాసీలను బలిగొంటున్న కేంద్రం

ఒంగోలు టౌన్: కగార్ ఆపరేషన్ పేరుతో అమాయక ఆదివాసీలను బలిగొంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మండిపడ్డారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా చెబుతున్న కేంద్ర ప్రభుత్వం మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. అడవుల్లో జీవించే ఆదివాసీలను తరిమికొట్టి ఖనిజ సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లను దోచిపెట్టే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.

కంచేసి.. కబ్జాచేసి..!

అధికారం అండ.. అధికారుల సహకారం..ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాబందుల్లా వాలిపోతున్నారు కూటమి నేతలు. ప్రభుత్వ..ప్రైవేటు భూములు దర్జాగా కబ్జాచేసేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రికార్డులను సైతం తారుమారు చేసేందుకు వెనుకాడడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరుపేదల భూముల రికార్డులను తమ పేర్లతో ఆన్‌లైన్ చేసుకుంటూ పాగా వేస్తున్నారు. ఇదేమిటని అడిగితే నీకు చేతనైంది చేసుకో అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. అక్రమార్కుల చెర నుంచి తమ భూములను కాపాడుకునేందుకు స్తోమత ఉన్నవారైతే కోర్టులను ఆశ్రయిస్తున్నారు. నిరుపేదలు జిల్లా ఉన్నతాధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వందలాది ఎకరాలు అన్యాక్రాంతమైపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

ఖాళీ జాగాలపై వాలిపోతున్న పచ్చదండు



- కురిచేడులో దాదాపుగా వెయ్యి ఎకరాల ఆక్రమణ
- ఒంగోలులో 5.6 ఎకరాల భూమి కబ్జాకు యత్నం
- మరో 2 ఎకరాలు కాజేసే పనిలో టీడీపీ నేతలు
- కనిగిరిలో 10 ఎకరాల గ్రామకంఠం భూమి స్వాహా
- కొండపిలో కోర్టుకు వెళ్లి భూములను కాపాడుకున్న వైనం
- అధికారుల అండదండలతో కబ్జాలపర్వానికి తెరదీసిన తమ్ముళ్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడవుగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భూ కబ్జాలకు తెరతీశారు. ఇసుక, గ్రావెల్, మద్యం దందాలతో సమాంతరంగా భూ ఆక్రమణలకు తెగబడుతున్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదుల్లో సింహభాగం భూ వివాదాలే ఉండడం గమనార్హం. జిల్లా కేంద్రం ఒంగోలు మొదలు ఎక్కడ చూసినా అధికార పార్టీ నేతల ఆక్రమణల పర్వాలే కనిపిస్తున్నాయి.

జిల్లా కేంద్రమైన ఒంగోలులో తెలుగు భూచోళ్ల బెడద ఎక్కువైంది. ఇటీవల నగర శివారులోని ముక్తినూతలపాడు సర్వే నంబర్ 15లో మొత్తం 21.80 ఎకరాల భూమి ఉంది. దీనిలో 5.6 ఎకరాల భూమిని కబ్జా చేసిన టీడీపీ నాయకులు చుట్టూ ఫెన్సింగ్ వేసేశారు. దీని విలువ సుమారు రూ.15 కోట్లపైగానే ఉన్నట్టు తెలుస్తోంది. వీరు అధికార పార్టీ కీలక నాయకుడి అండదండలతోనే కబ్జాకు పాల్పడినట్లు ప్రచారం జరిగింది. ఈ విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముక్తినూతలపాడు వెళ్లి కబ్జాకు గురైన భూములను పరిశీలించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఈ కబ్జా గురించి కీలక నాయకుడు నోరు తెరచి మాట్లాడకపోవడం గమనార్హం. ఇటీవల ఒంగోలు నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో భూ కబ్జాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. కబ్జాదారులంతా టీడీపీ నాయకులే కావడంతో రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రీవెన్స్‌లో భూములపైనే ఫిర్యాదులు...

ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తోంది. ఉన్నతాధికారులందరూ ఉంటారు కనుక వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి బాధితులు ఇక్కడకు వస్తుంటారు. వందలాది మంది ఫిర్యాదులు చేస్తుంటారు. ఈ ఫిర్యాదుల్లో సింహభాగం భూ వివాదాలు ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. తమ భూములను కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండడంలేదని బాధితులు వాపోతున్నారు. రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేల అండదండలుండడంతో ఎవరూ చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కురిచేడులో వేయి ఎకరాలు హాంఫట్

కురిచేడు మండలంలోని పొట్లపాడు గ్రామంలో 80 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు సమాచారం. దర్శి నియోజకవర్గ టీడీపీ కీలక నాయకురాలి చేత తహశీల్దారుకు ఫోన్ చేసి లైన్ క్లియర్ చేసుకున్న స్థానిక టీడీపీ నాయకులు ఇతర జిల్లాలకు చెందిన టీడీపీ నాయకులకు బేరం పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి సమీపంలో బయో గ్యాస్ ప్లాంట్ మంజూరు కావడంతో ఎకరా రూ.10 లక్షల వరకు పలుకుతోంది. అంటే రూ.8 కోట్లకు విక్రయించేందుకు ఒప్పందాలు జరిగినట్లు సమాచారం. పడమర వీరాయపాలెం గ్రామంలో సర్వే నంబర్ 8లో ఏకంగా 528 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు పచ్చ దండు ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రూ.60 కోట్ల విలువైన ఈ భూమిని ఇప్పటికే క్రయవిక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. కల్లూరు గ్రామంలో సుమారు 200 ఎకరాల భూమిని సాగుదారుల నుంచి టీడీపీ నాయకులు బలవంతంగా లాక్కోవడంతో న్యాయం కోసం బాధితులు కోర్టుకు వెళ్లారు. దీని విలువ ప్రస్తుతం రూ.20 కోట్ల వరకు ఉంది. మండలంలోని పెద్దవరం గ్రామంలో తెలుగు తమ్ముళ్లు 150 ఎకరాల భూమిని కబ్జా చేసినట్లు సమాచారం. దీని విలువ ఎకరా రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ భూముల్లోకి ప్రవేశించకూడదంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టినా వాటిని లెక్క చేయకుండా పచ్చ నేతలు కబ్జాకు పాల్పడ్డారు.

కొండపి, కనిగిరిల్లో కబ్జాల పర్వం...

ప్రభుత్వం వచ్చీరాగానే కొండపి మండలం పెట్లూరు గ్రామంలో రూ.6 కోట్ల విలువైన సుమారు 4.4 ఎకరాల భూమిని కొందరు టీడీపీ నాయకులు కబ్జా చేశారు. సదరు భూమిలో ఇళ్ల నిర్మాణాలు కూడా మొదలు పెట్టారు. బాధితులు కోర్టుకు పోవడంతో ప్రస్తుతం కబ్జా కథకు బ్రేక్ పడింది. కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలోని పెద ఇర్లపాడు గ్రామంలో సర్వే నంబర్ 870లో 9.82 ఎకరాల భూమిని కబ్జా చేశారు. ఇక్కడ ఎకరా రూ.30 నుంచి రూ.40 లక్షల వరకు ఉంది. సుమారు రూ.4 కోట్ల విలువ చేసే భూమిని కాజేయడానికి టీడీపీ నాయకులు స్కెచ్ వేశారని సమాచారం. బాధితులు కోర్టుకు వెళ్లడంతో ప్రస్తుతం ఆ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టారు. అయినా పచ్చదండు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

టిక్.. టిక్.. టిక్...

- ఫైనల్‌కు చేరిన వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తు

ఒంగోలు టౌన్: నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు కీలక దశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన పాత్రధారుడిగా అనుమానిస్తున్న అమ్మనబ్రోలు తెలుగు యువత నాయకుడు, హత్యలో పాల్గొన్న నలుగురు నిందితుల్లో నెల్లూరుకు చెందిన ఇద్దరు పాత్రధారులు, ఇంకా పలువురు అనుమానితులు పోలీసుల అదుపులోనే ఉన్నారు. కీలక పాత్రధారులుగా అనుమానిస్తున్న అమ్మనబ్రోలుకు చెందిన వ్యాపారి, కొప్పోలుకు చెందిన వ్యక్తి ఇంకా పరారీలోనే ఉన్నారు. అయితే, వీరయ్య హత్య జరిగి నేటికి 15 రోజులైంది. మరో రెండు రోజుల్లో వీరయ్య చౌదరి పెద్ద కర్మ నిర్వహించడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద కర్మ రోజు నాటికి కేసును ఫైనల్ చేయాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా ఆలస్యమైందన్న అసంతృప్తిలో వీరయ్య కుటుంబ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. అధిష్టానం నుంచి పోలీసుపై ఒత్తిడి వస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో కీలక నిందితులు పట్టుబడకపోవడంతో ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హతుడు వీరయ్య, హత్యకు పథక రచన చేసిన వారంతా టీడీపీ వారే కావడంతో కేసు ఏమవుతుందోనన్న అనుమానాలున్నాయి. రకరకాల ప్రచారాలు జరుగుతున్నప్పటీ పోలీసులు నోరు మెదపడంలేదు. పొరుగు ప్రాంతాలకు వెళ్లిన దర్యాప్తు బృందాలు ఇంకా గాలిస్తూనే ఉన్నాయి. మరిన్ని రోజులు ఎదురు చూడటం కంటే వీలైనంత త్వరగా ఫైనల్ చేసేస్తే బాగుంటుందన్న ఆలోచనలో పోలీసులు ఉన్నట్లు సమాచారం.

మూడు రోజులపాటు నీరు నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని మల్లవరం రిజర్వాయర్ వద్ద ఉన్న సీపీడబ్ల్యూ స్కీమ్ ద్వారా ఒంగోలు, మేదరమెట్ల వెళ్లే పైప్‌లైన్ల మరమ్మతుల కోసం మంగళవారం ఉదయం నుంచి 8వ తేదీ సాయంత్రం వరకూ నీటి సరఫరా నిలిపేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, కొత్తపట్నం, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొరిశపాడు, అద్దంకి, జేపంగులూరు మండలాల్లోని 69 గ్రామాల వారికి నీటి సరఫరా నిలిపేస్తున్నామని చెప్పారు. కొత్త మోటర్లు బిగించడం, పైప్‌లైన్లు లీకులు అయిన చోట్ల రిపేర్లు చేయిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజల పక్షాన పోరాడతాం

- ఐక్యంగా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తాం
- త్వరలో గ్రామ, బూత్ స్థాయి కమిటీలు
- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తే ఊరుకోం
- మద్దతు ధరలు లభించక అల్లాడుతున్న రైతులు
- విలేకర్ల సమావేశంలో చెవిరెడ్డి, కారుమూరి, బూచేపల్లి



విలేకరులతో మాట్లాడుతున్న కారుమూరి, పక్కన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, తాటిపర్తి చంద్రశేఖర్, అన్నా రాంబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ

ఒంగోలు సిటీ: జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి, ప్రజల పక్షాన పోరాడతామని వైఎస్సార్ సీపీ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులతో వారు సమావేశమయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. తొలుత ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ అందరం ఐక్యంగా ఉండి గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి కమిటీలను పూర్తి చేసుకున్నామన్నారు. త్వరలో గ్రామస్థాయి, వివిధ అనుబంధ సంఘాల కమిటీలను సైతం ఏర్పాటు చేసుకుంటామని చెప్పారు.

రెడ్‌బుక్ సిద్ధాంతంతో పావులుగా మారొద్దు: కారుమూరి

పార్టీని కింది స్థాయి నుంచి బలోపేతం చేసి, పార్టీ పునర్నిర్మాణం చేసే విషయంలో జిల్లా నాయకులు ముందున్నారని మాజీ మంత్రి, రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు అభినందించారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్‌బుక్ సిద్ధాంతం నడుస్తోంది. పోలీసులు అదే దారిలో నడుస్తుండడం సరికాదు. అకారణంగా అరెస్టులు చేయడం, పోలీస్ స్టేషన్లు తిప్పుతూ కొడుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ఇది ఇలాగే కొనసాగితే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం. ప్రభుత్వాలు మారుతుంటాయి, పోలీసులు మాత్రం ప్రజల పక్షాన నిలిచి అండగా నిలవాలి' అని ఆయన సూచించారు. 70 శాతం మంది టీడీపీ కార్యకర్తలు కూడా ఆ పార్టీని వ్యతిరేకిస్తున్నారన్నారు. వలంటీరు వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. పింఛన్లలో భారీ కోత పెట్టి నెలనెలా ఆ కార్యక్రమాన్ని ఆయన ఒక ఫార్సులా మార్చేశారన్నారు. ప్రతి నెలా ఒక కులానికి చెందిన దుకాణదారుడికి ఇచ్చి రాష్ట్రమంతా ఆ కులస్తులకు ఇచ్చినట్టు షో చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అన్ని రకాల రైతులు మద్దతు ధర లభించక అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు కనీసం గోతాము ఇవ్వలేని దుస్థితిలో మన సివిల్ సప్లయిస్ మంత్రి ఉన్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.3 వేల కోట్లతో స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నారని చెప్పారు. అమరావతి పేరుతో భారీగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

కార్యకర్తల్ని వేధిస్తే ఊరుకోం: బూచేపల్లి..


జిల్లాలో పోలీసులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధిస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇదే విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వారికి న్యాయం చేసేందుకు ముందుంటామన్నారు. దర్శిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త సురేష్ డీఎస్పీ కార్యాలయం పక్కనే దుకాణాన్ని పెట్టుకుంటే ఓర్వలేక సదరు డీఎస్పీ ఒక సీఐని, నలుగురు ఎస్‌ఐలను, కానిస్టేబుళ్లను పంపి కూల్చివేయించారన్నారు. "మీరు 60 ఏళ్ల పాటు ఉద్యోగం చేయాలి.. ఐదేళ్ల పాటు ఉండే వారి పక్షాన పనిచేస్తే సరికాదు.. రానున్న రోజుల్లో మా ప్రభుత్వం వస్తుంది..మాకు పదవులూ వస్తాయి.. అది గుర్తుంచుకోవాలి. మీరు ప్రజల పక్షాన నిలిచి వారికి న్యాయం చేయాలి'' అని బూచేపల్లి అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను కొట్టే లా అండ్ ఆర్డర్ కింద పోలీసు వ్యవస్థ నడుస్తోందని విమర్శించారు. కార్యకర్తలను కాపాడుకునేందుకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. పొగాకు, పత్తి, మిర్చి, వరి తదితర పంటలు సాగుచేసిన వారికి కనీస గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతున్నారన్నారు. పొగాకు రైతుకు మద్దతుగా నిలుస్తామన్నారు. అవసరమైతే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. పులి..!

- అర్థవీడు మండలంలో తరచూ సంచారం
- పశువులపై దాడి చేసి చంపితింటున్న పులులు
- ఆందోళనలో రైతులు, ప్రజలు
- భయపడాల్సిన పనిలేదంటున్న ఫారెస్టు అధికారులు
- అటవీ ప్రాంతంలో ట్రాప్‌కెమెరాలు అమర్చుతున్న అధికారులు

అర్థవీడు: అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న మండలంలోని పలు గ్రామాల్లో తరచూ పెద్దపులి, చిరుత పులులు సంచరిస్తున్నాయి. మండలంలోని లక్ష్మీపురం, మాగుటూరు, కాకర్ల, వెలగలపాయ, మోహిద్దీన్‌పురం, అచ్చంపేట, దొనకొండ, తాండ గ్రామాలకు తరుచూ పులులు వచ్చి వెళుతున్నాయి. తాజాగా రెండు రోజుల క్రితం మిట్టమీదపల్లి రహదారి పై రాత్రివేళ ఆర్టీసీ బస్సుకు అడ్డంగా పులిరావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు: పులుల సంచారం నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు. ఎప్పటికప్పుడు అటవీ ప్రాంతంలో పర్యటిస్తూ అవసరమైన చోట ట్రాప్ కెమెరాలను అమర్చి పులుల జాడలను పసిగడుతున్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అవి ఎక్కువగా రాత్రి పూట తిరుగుతుంటాయని రైతులెవరూ రాత్రిపూట అటవీ ప్రాంతంలోకి వెళ్లకూడదని, అదే విధంగా పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.



పులి ఆచూకీ కోసం గాలిస్తున్న ఫారెస్టు అధికారులు



ట్రాప్‌కెమెరాలో కనిపించిన పులి (ఫైల్‌ఫొటో)

ఆహారం కోసం తిరిగే క్రమంలో..

నాగార్జునసాగర్ టైగర్ జోన్ పరిధిలో పులుల సంరక్షణకు చర్యలు తీసుకోవడంతో పెద్దపులల సంతతి పెరిగింది. అవి ఆహారం వేటలో భాగంగా, ఒక చోట నుంచి మరోచోటుకు వెళ్తున్న క్రమంలో ఎద్దులపై, గేదెలపై, ఇతర పశువులపై దాడి చేస్తున్నాయని వాటి వల్ల మనుషులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని అధికారులు చెబుతున్నారు. పులులు ఎక్కువగా రాత్రి పూట, తెల్లవారుజామున మాత్రమే తిరుగుతుంటాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల పులి సంచరించిన ఘటనలివీ..

- వెలగలపాయకొండ పెద్దపులి దాడి చేయడంతో ఓ ఎద్దు మృతి చెందింది.
- వెలగలపాయకొండ సమీపంలో ఎద్దులను మేతకు తీసుకెళ్లగా ఎద్దుపై పెద్దపులి దాడి చేస్తున్న సమయంలో చూసిన రైతు కేకలు వేయడంతో పులి పారిపోయింది.
- లక్ష్మీపురం, మాగుటూరు గ్రామాల సమీపంలో ఉన్న కోమటికుంట వద్దకు పెద్దపులి వచ్చి నీళ్లు తాగి వెళ్తున్నట్లు స్థానికులు గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు.
- ఐదు నెలల క్రితం మండలంలోని మొహిద్దీన్‌పురం వద్ద రాత్రి పూట కారులో వెళ్తున్న వారికి చిరుతపులి రోడ్డు దాటుతూ కనిపించిందని స్థానికులకు సమాచారం ఇచ్చారు.
- కొన్ని రోజుల తర్వాత అచ్చంపేట గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో మేత కోసం వెళ్లిన ఎద్దుపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. నాలుగు రోజుల క్రితం మండలంలోని దొనకొండ, తాండ గ్రామాల్లో రెండు గేదెలను పెద్దపులి దాడి చేసి చంపగా ఫారెస్టు అధికారులు రైతులకు నష్టపరిహారం అందించారు.

ప్రజలు భయపడాల్సిన పనిలేదు



ప్రజలెవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు అవసరమైన చోట ట్రాప్ కెమెరాలు అమరుస్తూ వాటి జాడలను పసిగడుతున్నాం. అవి ఎక్కడా మనుషులకు హానికలిగించలేదు అడపా దడపా సందర్భాల్లో పశువుల పై దాడి చేస్తున్నాయి. అలా జరిగిన సందర్భాల్లో రైతులకు నష్టపరిహారం అందిస్తాం. ఎవరైనా వేటగాళ్లు పులుల కోసం ఉచ్చులు బిగించారా అన్న కోణంలో గాలిస్తున్నాం. వన్యప్రాణుల రక్షించుకోవడం మన బాధ్యత.

– ముక్కు ప్రసాదరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్

రాత్రి వేళ పొలం వద్దకు వెళ్లాలంటే భయంగా ఉంది



ఇటీవల కాలంలో తరుచూ పులులు సంచరిస్తుండటంతో రాత్రి పూట నీళ్లు పెట్టేందుకు పొలాలకు వెళ్లాలంటే భయంగా ఉంది. వాటి వల్ల ప్రజలకు, రైతులకు ప్రమాదం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మెట్ల బాలరాజు, రైతు

ఉపాధి పని కోసం 8 కి.మీ నడక..

రాచర్ల: అక్కడ ఉపాధి హామీ పనికి వెళ్లాలంటే 8 కిలోమీటర్లు వెళ్లాలి. పాలకవీడు పంచాయతీ అనుమలవీడు గ్రామానికి చెందిన 40 మంది కూలీలకు శీలంవెంకటరెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఎత్తైన అటవీ ప్రాంతంలో ఉపాధి పనులు ఏర్పాటు చేశారు. సోమవారం కొంత మంది కూలీలు ఆటోల్లో వెళ్లగా, మరికొందరు 8 కి.మీ దూరాన్ని కాలినడకన వెళ్లారు. ఉదయం ఉపాధి కూలీలకు పనులు చేసే ప్రాంతాన్ని చూపించి మస్టర్‌లో పేర్లు నమోదు చేసి మళ్లీ పని ముగిసిన తరువాత మస్టర్‌వారీగా కూలీల ఫొటోలను అప్‌లోడ్ చేయడానికి సర్వర్ సక్రమంగా పని చేయలేదు. దాదాపు 12 గంటల వరకూ సమయం పట్టడంతో కూలీలు తీవ్రమైన ఎండలకు నానా అవస్థలు పడ్డారు. ఎండలకు పనులు చేసి ఎత్తైన కొండలపై నుంచి దిగేందుకు వృద్ధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామాల వారీగా ఉపాధి కూలీలకు పనులు చూపించి పనులు చేస్తుంటే పాలకవీడు పంచాయతీలో మాత్రం దీనికి విరుద్ధంగా జరుగుతోందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎత్తైన కొండ ప్రాంతాల్లో కాకుండా పనులు ఏర్పాటు చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.



మస్టర్‌లో ఫొటోలు అప్‌లోడ్ కోసం ఫీల్డ్‌అసిస్టెంట్ వద్ద గుమిగూడిన ఉపాధి కూలీలు

క్లుప్తంగా

కొత్తపాలెంలో నీటి సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: పొన్నలూరు మండలం రాజోలుపాడు పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో సుమారు 25 ఏళ్ల క్రితం రూ.1.60 కోట్లతో సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ఏర్పాటు చేశారు. అయితే ఈ స్కీమ్ పంచాయతీలతో సంబంధం లేకుండా పనిచేసేందుకు ప్రత్యేకంగా టెండర్ ఏర్పాటు చేసి నీరు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టెండర్ ప్రక్రియను నిలిపేసి సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా నీళ్లు వదిలే పనిని స్థానిక తెలుగు తమ్ముళ్లు తీసుకున్నారు. ఈ క్రమంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరు మొదలై గత నాలుగు రోజుల నుంచి సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా గ్రామస్తులకు నీటి సరఫరా ఆగింది. దీంతో గ్రామస్తులు తాగు, వాడుక నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై 'ఆధిపత్య పోరు.. నిలిచిన నీరు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఓ వ్యక్తిని నియమించి సోమవారం నీటిని సరఫరా చేశారు. గత నాలుగు రోజులుగా ఉన్న నీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



మృతి చెందిన అలీ

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం కనిగిరిలో చోటుచేసుకుంది. వివరాలు.. కనిగిరి పదో వార్డులోని హనీఫ్ నగర్‌కు చెందిన సయ్యద్ అలీ(15) అతని స్నేహితుడు కలిసి బైక్‌పై మాచవరం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో చాకిరాల రోడ్డు వైపు నుంచి ఆర్.సాయి(విద్యార్థి) బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తూరు సమీపంలోని మలుపు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బైక్‌పై వెనుక వైపు కూర్చుని ఉన్న సయ్యద్ అలీ తలకు బలమైన గాయాలు కావడంతో ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తొలుత ఒంగోలుకు, అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ అలీ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

అందరివాడు అలీ..

చిన్న తనంలోనే అలీ తల్లిదండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మ, తాతయ్య సంరక్షణలో పెరుగుతున్నాడు. హనీఫ్ నగర్‌లో ప్రతి ఒక్కరికీ తలలో నాలుకలా మారాడు. ప్రమాదానికి ముందు వరకు తమతో ఆడుకున్న అలీ.. అనుకోని రీతిలో మృత్యు ఒడికి చేరడంతో స్నేహితులంతా రోధించారు. తాతయ్య కరీముల్లా, అమ్మమ్మ, పిన్ని రోధిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరైతే మాకేంటి?

- పంచాయతీ కార్యదర్శుల బదిలీల వ్యవహారంపై సాగదీత ధోరణి
- హైకోర్టు తీర్పు అమలులో అలవిమాలిన జాప్యం
- పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలంటే లెక్కేలేదు
- కోర్టు కేసులు వాపస్ తీసుకోవాలని బెదిరించడంపై కార్యదర్శుల ఆగ్రహం

సాక్షి నెట్‌వర్క్:

ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టు, అభ్యంతరాలతో ప్రకటనలు చేసి ఆ ధామాషా ప్రకారం పంచాయతీ కార్యదర్శుల బదిలీలు నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. జిల్లా పంచాయతీ అధికారులు కోర్టులన్నా.. ఉన్నతాధికారుల ఆదేశాలన్నా లెక్కలేనట్లుగా వ్యవహరిస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు రగిలిపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల వ్యవహారంపై పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన ఈ బదిలీలకు సంబంధించి జిల్లా పంచాయతీ కార్యాలయంలో గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 4 వరకు బదిలీలు ఒకరు, గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల బదిలీలు మరొకరు చూసుకునేలా పంచుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. అర్హతలను బట్టి కాకుండా ఎవరు ఎక్కువ మొత్తంలో సొమ్ము ముట్టజెబితే వారిని వారు కోరుకున్న గ్రామ పంచాయతీలకు బదిలీ చేశారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. దీనిపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆగ్రహం వ్యక్తం చేశారు కూడా. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలపై విచారణకు ఆదేశించారు. విచారణలో అక్రమాలు జరిగాయని తేలడం, గ్రేడ్-5, గ్రేడ్-6(సచివాలయ డిజిటల్ అసిస్టెంట్)ల వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలతో డీపీఓ కార్యాలయ ఉద్యోగులు కిషోర్ బాబు, పి.సాయి కోటేశ్వరరావు, శివ ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు వేసి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయితే ఈ వ్యవహారం మొత్తంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి పై రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు ఎలాంటి విచారణ కానీ, డిజిటల్ పేమెంట్ల వివరాలు కానీ పరిశీలించకుండానే వదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు సంబంధించి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు, వైకల్యం శాతం వంటి వివరాలను తప్పులతడకగా నమోదు చేసి అర్హత లేని వారిని కూడా పంచాయతీలకు బదిలీ చేసి అక్రమాలకు పాల్పడ్డాడని అభియోగాలున్నాయి. సదరు వ్యక్తిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా దొంగ పత్రాలు సృష్టించి అడ్డగోలుగా బదిలీలు చేశారని ఆరోపిస్తూ కొంత మంది హైకోర్టును ఆశ్రయించారు. ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టు, అభ్యంతరాలతో ప్రకటనలు చేసి ఆ ధామాషా ప్రకారం పంచాయతీ కార్యదర్శుల బదిలీలు నిర్వహించాలని 2024 డిసెంబర్ 21వ తేదీన హైకోర్టు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ ఫైల్ జిల్లా కార్యాలయానికి ఈ ఏడాది జనవరి 8వ తేదీన అందగా దానిని కలెక్టర్ తమీమ్ అన్సారియా పంచాయతీ అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసి కోర్టు ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కోర్టు సూచించిన నిబంధనల మేరకు ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టును ఆయా శాఖల వారీగా కోర్టు ఆర్డర్ వేసిన డిసెంబర్ 21వ తేదీ 2024 నుంచి 4 వారాల్లోపు ప్రచురించి, మరో 15 రోజుల గడువుతో అభ్యంతరాలు స్వీకరించి, వాటిని 6 వారాల్లోగా పరిష్కరించాల్సి ఉంది. చివరగా కోర్టు సూచించిన ప్రకారం అమలు చేసిన జాబితా తో జిల్లా పంచాయతీరాజ్ అధికారులు తుది జాబితాను సింగిల్ జడ్జి ముందు ప్రవేశపెట్టాలి. తుది జాబితాతో సింగిల్ జడ్జి ముందు హాజరయ్యే సమయం గత నెల 24వ తేదీతో ముగిసింది. కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాలు అమలు చేయాలని కలెక్టర్ డీపీఓకు ఎండార్స్ చేస్తూ లేఖ ఇచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇంత వరకూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు అమలు చేయకపోవడంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీగా ముడుపులు దండుకున్న నేపథ్యంలో బదిలీ చేసిన వారిని వెనక్కు పిలిస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్న భయంతో కమిషనర్ ఆదేశాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా కోర్టుకు వెళ్లిన వారిని కేసులు వాపసు తీసుకోవాలని, లేని పక్షంలో స్థానికంగా ఉండే వారితో బలవంతంగా తప్పుడు కేసులు పెట్టించి వేధింపులకు గురిచేస్తున్నారని పలువురు కార్యదర్శులు వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

బదిలీల వ్యవహారం తాను లేనప్పుడు జరిగింది. కొత్తగా వచ్చాను. కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. వాయిదాల ప్రకారం కోర్టులకు వివరాలు సమర్పిస్తున్నాం. ఇది జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.

– జి.వెంకటనాయుడు, డీపీఓ, ఒంగోలు

ప్రకృతి విపత్తుల్లో ప్రాణ నష్టాన్ని నివారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన జేసీ, డీఆర్ఓ

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. జిల్లాలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం, గాలి, దుమారం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సోమవారం అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విపత్తుల సమయంలో గ్రామస్థాయి సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. పిడుగుపాటుకు దారితీసే పరిస్థితులు, ఆయా సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

డప్పు, చాటింపుతోపాటు ప్రసార మధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. వాతావరణ మార్పులపై వస్తున్న హెచ్చరికలను ప్రజలకు చేరవేయాలని చెప్పారు. సమావేశంలో డీఆర్ఓ ఓబులేసు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సత్తాచాటిన బొడిచర్ల ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో మార్కాపురం మండలం బొడిచర్లకు చెందిన టి.నక్షత్రారెడ్డి, ధ్రువసాయిరామ్ సంయుక్త ఎడ్ల జత 2,750 అడుగుల దూరం బండ లాగి మొదటి స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా అలగనూరు రోలి మోడం ఎడ్లు 2,516 అడుగులు, నంద్యాల జిల్లా జిల్లెలకు చెందిన గొటిక దినేష్‌రెడ్డి ఎడ్లు 2,509 అడుగులు, నంద్యాల జిల్లా పెసరవాయికి చెందిన సయ్యద్ కలాం ఎడ్లు 2,502 అడుగులు, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లు 2,384 అడుగులు, వీరాస్వామికి చెందిన మరో జత ఎడ్లు 2,266 అడుగులు, గిద్దలూరుకు చెందిన దుర్వాసుల అశ్విని ఎడ్లు 2,000 అడుగులు, జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగశివశంకర్ ఎడ్లు 1,843 అడుగుల దూరం లాగి వరుసగా రెండు నుంచి ఎనిమిది స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలను దాతలు పంపిణీ చేశారు.

స్టాండింగ్ కమిటీ లేనట్లే..!

- కాల పరిమితి పూర్తయ్యి ఏడాదైనా నేటికీ వెలువడని నోటిఫికేషన్
- రూ.40 లక్షల వరకు పనులు స్టాండింగ్ కమిటీ ఆమోదంతో పూర్తి చేయవచ్చు
- అజెండాలోని అంశాలకే పరిమితమవుతున్న కౌన్సిల్
- సాధారణ సమస్యలపై చర్చించే జీరో అవర్‌కు మంగళం
- నేటి కౌన్సిల్ సమావేశంలో 124 అంశాలు.. 50కి పైగా ముందస్తు అనుమతులపైనే..



ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ ఇక లేనట్లేనా అంటే ఔననే సమాధానం వస్తోంది. స్టాండింగ్ కమిటీ కాలపరిమితి పూర్తయి ఏడాది దాటినా నోటిఫికేషన్ ఇవ్వకుండా వదిలేయడంతో పురపాలన తీరును తేటతెల్లం చేస్తోంది. నగరంలో చేపట్టే అన్ని అభివృద్ధి పనులకు ముందస్తుగా మేయర్ అనుమతి తీసుకుని, ఆ తర్వాత కౌన్సిల్లో ప్రవేశపెట్టి మంజూరు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రూ.10 లక్షలలోపు పనులకు కమిషనర్, రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పనులను స్టాండింగ్ కమిటీ ఆమోదించవచ్చు. కానీ ఒంగోలు నగర పాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ ఊసే లేకుండా చేశారు. కూటమి పార్టీల నేతల మధ్య పొంతన కుదరకపోవడం ఇందుకు ఒక కారణం. మూడు నెలలకు ఒకసారి ఏర్పాటు చేసే ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ టీడీపీ కార్పొరేటర్లతో అంతర్గత సమావేశం నిర్వహించారు. వీరి మధ్య స్టాండింగ్ కమిటీ ప్రస్తావన రాగా అందరూ స్టాండింగ్ కమిటీలో స్థానం కోసం పోటీపడినట్లు విశ్వసనీయ సమాచారం. 50 మంది కార్పొరేటర్లలో 25 మంది టీడీపీ, 21 మంది జనసేనలో ఉన్నారు. స్టాండింగ్ కమిటీలో నియమించేది ఐదుగురు సభ్యులను మాత్రమే కావడంతో ఇప్పుడు సాధ్యమయ్యే పనికాదని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు సమాచారం. కాంట్రాక్ట్ పనుల కోసం ఇసుక, కంకర, ఇటుక తోలిన ప్రాంతాలకు వెళ్లి కూటమి నేతలు తనకు చెడ్డ పేరు తెస్తున్నారని దామచర్ల అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

124 అంశాల్లో 50కి పైగా ముందస్తు అనుమతులే..

మంగళవారం నిర్వహిస్తున్న సాధారణ కౌన్సిల్ సమావేశంలో దాదాపు రూ.20 కోట్లకు పైగా నిధుల మంజూరు కోసం మొత్తం 124 అంశాలు పొందుపరిచారు. వాటిలో 50కి పైగా అంశాలు ముందస్తు అనుమతుల కోసం పొందుపరిచినవే కావడం గమనార్హం. గతంలో వైఎస్సార్‌సీపీకి కౌన్సిల్లో పూర్తి స్థాయి మెజారిటీ ఉన్నప్పుడు ముందస్తు అనుమతులు తీసుకుని కౌన్సిల్లో రాటిఫికేషన్‌కు పెడితే టీడీపీ ఫ్లోర్ లీడర్ రమణయ్య నానా యాగీ చేశారు. ప్రస్తుతం టీడీపీ కూటమికి కౌన్సిల్లో మెజారిటీ ఉన్నా ఇబ్బడిముబ్బడిగా రాటిఫికేషన్లు పెడుతున్నారు. అయినా నాడు యాగీ చేసిన నాయకులు నేడు కిమ్మనడం లేదు.

జీరో అవర్‌కు మంగళం

నగరంలో సాధారణ సమస్యలపై చర్చించే అవకాశమే లేకుండా చేశారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపైనే చర్చించి ఎవరి దారిన వారు వెళ్లిపోతున్నారు. కౌన్సిల్ సమావేశాల్లో ''జీరో'' అవర్ ప్రవేశపెడితే ప్రజలు ఎదుర్కొంటున్న సాధారణ సమస్యలను సభ్యులు లేవనెత్తే అవకాశం ఉంటుంది. మంచినీరు, పారిశుధ్యం, చెత్త ఆటోల తొలగింపు, డ్రెయినేజీలు తదితర సమస్యలపై సభ్యులు మాట్లాడే అవకాశం ఒక్క జీరో అవర్‌లోనే ఉంటుంది. అందుకోసం కౌన్సిల్ సమావేశంలో జీరో అవర్‌ను ప్రవేశపెట్టాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు కోరుతున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. ప్రకాశం భవన్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం జిల్లా అధికారుల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ నుంచి ఉదయం 9 గంటలకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యుత్‌కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మొత్తం 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మొదటి సంవత్సరం విద్యార్థులు 15,428 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 5309 మంది పరీక్షలు రాయమన్నారని జేసీ వెల్లడించారు. సమావేశంలో ఆర్ఐఓ, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ ఎ.సైమన్ విక్టర్ పరీక్షల సన్నద్ధతకు సంబంధించిన అధికారుల నియామకం, సౌకర్యాల కల్పన, పరీక్ష కేంద్రాల సమగ్ర సమాచారాన్ని వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆమె ఆదేశం.. అధికారుల అత్యుత్సాహం!

- ట్రాఫిక్ పేరుతో దర్శిలో అడ్డగోలుగా దుకాణాల తొలగింపు
- టీడీపీ సానుభూతిపరుల జోలికి వెళ్లని నగర పంచాయతీ అధికారులు
- టీడీపీ అయితే సరే.. వైఎస్సార్ సీపీ అయితే ఒప్పుకోమన్నట్లుగా తీరు



డ్రెయినేజీ దాటి ముందుకు వచ్చిన దుకాణాలు



గడియార స్తంభం సెంటర్లో అద్దంకి రోడ్డులో పూల దుకాణాలు ఇలా..

సాక్షి టాస్క్‌ఫోర్స్: దర్శి పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల వ్యాపారాలపై కూటమి నేతల కక్షసాధింపులు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. అధికారులు సైతం కూటమి నేతల అడుగులకు మడుగులొత్తుతూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల దుకాణాలు తొలగించేందుకు అత్యుత్సాహం చూపుతున్నారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి కనుసన్నల్లో సాగుతున్న కక్ష సాధింపుల పర్వానికి స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్న పరిస్థితి. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త సంస్కృతిని దర్శికి అలవాటు చేసి కూటమి మద్దతుదారులే వ్యాపారాలు చేయాలని భీష్మించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నగర పంచాయతీ అభివృద్ధిని గాలికొదిలేసి వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల వ్యాపారాలను దెబ్బతీయడమే లక్ష్యంగా పావులు కదపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాస్తవానికి దర్శిలోని కురిచేడు రోడ్డు, అద్దంకి రోడ్డు, తూర్పుచౌటపాలెం రోడ్డులో సైడు కాలువలు దాటి ముందుకు వచ్చి మరీ దుకాణాలు నిర్మించి వ్యాపారాలు చేసుకుంటుంటే గుడ్లప్పగించి చూస్తున్న నగర పంచాయతీ అధికారులు.. కేవలం వైఎస్సార్ సీపీ కార్యకర్తలనే టార్గెట్ చేస్తున్నారనేందుకు రెండు రోజుల క్రితం జరిగిన సంఘటనే తాజా నిదర్శనం. కొణతం అపర్ణ, సురేష్‌రెడ్డికి చెందిన దుకాణాన్ని తొలగించేందుకు పదుల సంఖ్యలో పోలీసులను పురమాయించిన తీరు చూసి విస్తుపోవడం స్థానికుల వంతయింది. అద్దంకి రోడ్డు శివారులో వైఎస్సార్ సీపీ నాయకుడు తన ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాన్ని తొలగించారు. పొదిలి రోడ్డులో వైఎస్సార్ సీపీ నాయకుల దుకాణాలు రోడ్డుపైకి వచ్చాయంటూ వాటిని తొలగించారు. టీడీపీకి చెందిన వారి దుకాణాల జోలికి మాత్రం అధికారులు వెళ్లలేదు. టిఫిన్ సెంటర్ వంట సామగ్రి కాలువపై అడ్డుగా ఉందంటూనగర పంచాయతీ అధికారులు నిర్దాక్షిణ్యంగా ట్రాక్టరులో వేసుకుని వెళ్లారు. మరో షాపు రోడ్డుపై ఉందని చెప్పి బెదిరింపులకు దిగారు. డ్రెయినేజీ హద్దుకు లోపలి వైపు ఉన్న చిరు వ్యాపారులను సైతం బెదిరించి మూసేయించారు. కురిచేడు రోడ్డు, అద్దంకి రోడ్డులో డ్రైనేజీ దాటి రోడ్డుపైకి వచ్చిమరీ దుకాణాలు నిర్వహిస్తున్నా టీడీపీ వ్యక్తులనే కారణంతో నగర పంచాయతీ కమిషనర్ మహేష్ పట్టించుకోవటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి తోడు నగరపంచాయతీ కి చెందిన ఓ ఉద్యోగి చిరువ్యాపారుల వద్ద రోజూ అనధికార శిస్తు వసూలు చేసి కూటమి నేతలు, అధికారుల జేబులు నింపుతున్నాడని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఆ ఉద్యోగి దోపిడీని ఎదిరించలేని చిరువ్యాపారులు మనోవేదన అనుభవిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలంటే అందరికీ ఒకే న్యాయం వర్తింపజేయాలని, ఇలా కొందరినే లక్ష్యంగా చేసుకుని వేధించడం సబబు కాదని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

8 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

బేస్తవారిపేట: మండలంలోని నేకునాంబాద్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు మొదటి, రెండో బహుమతులు వరుసగా రూ.2 లక్షలు, రూ. లక్ష అందజేస్తామని పేర్కొన్నారు. ప్రవేశ రుసుం రూ.10 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 7842826813ను సంప్రదించాలని సూచించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 80 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి 80 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ ఏఆర్ దామోదర్, ఇతర పోలీసు అధికారులు అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడిన ఎస్పీ చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా కార్యాలయానికి పంపించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో ఎక్కువగా భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ రవణ కుమార్, రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సీసీఎస్ సీఐ జగదీష్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.